మారుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన కొలత బద్దలకు సరిపోని సాహిత్యాన్ని ప్రభుత్వం విధ్వంసం చేస్తున్నది. యుద్ధానంతరమీ విషయానికి నిదర్శనాలు అనేకం లభించినై. రష్యను రచయితలలో జోష్చెంకో సుప్రసిద్ధుడు. అతడు 'జ్వెజ్ డా' పత్రికా సంపాదకుడు. 1946 జూన్ మాసంలో, రష్యా కమ్యూనిస్టు పార్టీ జోష్చెంకో రచనలను లక్ష ప్రతులు ప్రకటించటానికి తీర్మానించింది. కాని మరి రెండు నెలల తర్వాత ఆగస్టులో జోష్చెంకోను రష్యాకు గర్భశత్రువుగా ప్రకటించి అతని రచనలను ప్రచారం నుండి తొలగించి వేసింది ప్రభుత్వం. అతడు పత్రికా సంపాదకత్వం కూడా గోల్పోయాడు. జోష్చెంకో రచనలలో కెల్ల పూర్తిగా గర్హించబడి విమర్శించబడిన కథ ఇది.

> "మరణశయ్యపై నున్న వృద్ధుడు, భార్యవైపు చూస్తాడు. ఆమె అతని హస్తాన్ని గైకొని వక్షస్థలంపై నుంచుకొంటుంది. వృద్ధుని విషాదవదనంలో చిరునవ్వు కన్పిస్తుంది. వెంటనే అతడు మరణిస్తాడు. గృహం రోదనలతో నిండిపోతుంది."

ఈ కథ సోవియట్ ప్రభుత్వానికి ఆగ్రహం కలిగించటానికి గల కారణం ఏమిటి? కేవలం ఆర్థిక రాజకీయములైన విషయాలే ఆనందానికి కారణములు కావని, అగాధమైన, అవ్యక్తమైన భౌతిక మానసిక కారణాలు మానవుని ఆనందానికి కారణాలని నిరూపిస్తూ జోష్చెంకో సాంప్రదాయసిద్ధమైన మార్క్సు అభిప్రాయాలను వ్యతిరేకించాడని అతనిపై అభియోగం. అభ్యుదయ దృక్పథం ఇదేనా?

ఈవిధంగా 'సాహిత్యం' రాజకీయ సాధనంగా నుపయోగింపడి నిర్జీవమై పోతోందనడంలో అత్యుక్తిలేదు. శాస్త్ర విజ్ఞానం ప్రభుత్వాలకు ఆయుధమై, మారణహోమాల్లో ప్రపంచాన్ని తేలుస్తోంది. సాహిత్యంకూడా ప్రభుత్వానికి సాధనమైనచో ఇక మానవుడు మానసికంగా పరిణామక్రమంలో వెనుకటి దశకు పోవలసిన దౌర్భాగ్యం పట్టక తప్పదు.

కాబట్టి 'అభ్యుదయ సాహిత్యం' అసలు సాహిత్యంగాదు. ప్రచారానికి వీలుగా నుపయోగింపబడుతున్న వాఙ్మయ సాధనం. ఇక ఆ సాహిత్యం ప్రచారంచేసే భావాలు, ఆశయాలు కూడా అభ్యుదయకరంగా లేవు. కేవలం పురాతనమైనవి, విధ్వంసాత్మకమైనవి. 'అభ్యుదయ సాహిత్యం' పేరుతో ప్రచారంలోనున్న రచనల్లో నిజంగా అభ్యుదయమూ లేదు, సాహిత్యమూ లేదనే విషయం యథార్థము.

కొత్త పద్ధతులు

# సమస్యా పరిష్కారం

జీవితం సమస్యలతో కూడుకుని ఉన్నది.

సమస్యలు పరిష్కారాలు కోరతాయి. సమస్యను పరిష్కరించటానికి చాలా మార్గాలుంటాయి. కొందరికి సమస్య ఎందు కేర్పడ్డానో తెలుసుకుని ఆ కారణాలు తొలగించడం ఇష్టం. ఇదే సరి అయిన పరిష్కారమార్గం అనుకునే మూఢవిశ్వాసులు చాలామంది ఉన్నారు. నిజానికి అన్నిటికన్నా కష్టతరమైన దీ మార్గమే. ఆంధ్రదేశంలో ఉప్పెన వచ్చింది. ఎందుకొచ్చింది? బంగాళాఖాతంలో వాయు గుండం ఏర్పడటం వల్ల ఉప్పెన వచ్చింది. వాయు గుండాన్ని ఎట్లా తీసెయ్యటం? వీల్లేదు. అట్లాగే, సంసార భారం ఎందుకు పెరుగుతున్నది? పిల్లలు పుట్టుకు రావటంవల్ల! పిల్లలెందుకు పుట్టుకొస్తున్నారు! పెళ్ళాట్టంవల్ల! ఇందులో ఏ కారణాన్ని తీసేస్తాం? జైల్లో తోస్తారు!

కారణాలను తీసెయ్యటం మాటలు కాదు. కారణాలు గతానికి చెంది ఉంటాయి. అవి కార్యరూపంలో అంతర్హితంకూడా అయి ఉంటాయి. అంతర్హితం కానప్పుడు కూడా

వాటిని తీసెయ్యటం మాటలు కాదు. అవి "హలాల్" అంటే పోవు. ఒక్కొక్కసారి తిరగ బడతాయి, మా చాకలిలాగా.

అందుచేత బుద్ధిమంతు లైనవారు, ఇబ్బం దిప్పుడు, సమస్యలను ఎదుర్కొనే టప్పుడు చాలా యుక్తిగా ఆ సమస్యలకు కారణాలే లేనట్టు నటిస్తున్నారు. వాటిని దువ్వి, బుజ్జగించి, గోముచేసి, ముద్దెట్టుకుని, జైకొట్టి బుట్టలో వేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

నేను మా చాకలాడితో అదే చేస్తున్నాను. నా కేర్పడ్డ సమస్య మీరంతా ఊహించుకో వచ్చు. ఇటీవల నా చొక్కాలు—సరి కొత్త చొక్కాలు సయితం—ఒక్క ఉతుక్కే చిరిగి పోతున్నాయి. అచ్చంగా చొక్కాల దుర్మా ర్గమే అనుకోవటానికి ధోవతులూ, బనీనులూ, మా ఆవిడ చీరెలూ, దుప్పట్లూ, జంబుఖానాలూ, (చాకలికి వేసినప్పుడు) తివాసీలూకూడా చిరిగి పోతూనే ఉన్నాయి.

నేను సహజంగా చాకల్ని తిట్టుకున్నాను, వాణ్ణి ఏమీ అననందుకు మా ఆవిణ్ణికూడా తిట్టాను.

మా ఆవిడ అంతకన్న సహజంగా నన్ను తిట్టింది. చాకలిని అనే గుండె ధైర్యం ఉంటే నన్నే అనమన్నది. చాకలిని అనలేకనా? మహారాజుగా అందును. కాని అది డిప్లొమెసీ కాదు. అందులో కావ్యంలేదు. వాడు ఏ మత్తునో ఉండి నన్ను మళ్ళీ అన్నాడంటే ఇక నామాట మా ఎదటింటివాళ్ళు కుక్కకూడా వినదు. ఆ సంగతి ఆడదైన మా ఆవిడకు ఎట్లా తెలుస్తుంది?

అందుకని నేను మా చాకలివాడిమీద నా డిప్లొమెసీ అంతా ఉపయోగించాను. వాడువచ్చే టైముకు ఇంట్లోఉండి వాణ్ణి చూడగానే ఒక చక్కని చిరునవ్వు పారేశాను.

మా ఆవిడ, పిచ్చిమొత్తుకోలు, వంటింట్లో నుంచి, "అదుగో, వాణ్ణి నాలుగు పెట్టండి," అని కేకేసింది.

"వాడు వాడు కనిపిస్తున్నాడు," అని మళ్ళీ కేకేశాను.

"ఒరే చాకలీ," అన్నాను గొంతు కొద్దిగా సవరించుకుని.

"ఏం, బాబూ" అన్నాడు చాకలి.

"ఒరే, గుడ్డలఖరీలు మండిపోతున్నాయి."

"అవును, బాబూ."

"మన గుడ్డలు పాకిస్తానువాళ్ళకూడా కగ్గ స్తున్నారు—ధరలతో మండరం చాలనట్టు."

"అలాగాండి?"

"అదికూడా ముఖ్య సమస్యకాదు. ఈ కరువు కాటకంలో మనకు గుడ్డలు బొత్తిగా అటు రాకుండా ఉన్నాయి. మనకు పేరుకు ఎనిమిది చొక్కా లున్నాయి కాని ధరించటానికి యోగ్యమైనది ఒకటే కనిపిస్తున్నది. ప్రస్తుతం మన ఆర్థిక వెనుకబాటునుబట్టి ఈ చంకలో చినిగిన చొక్కా కలుపుకున్నా రెండుకంటే చొక్కాలు లేవు. కాగా ఈ ఎనిమిది చొక్కాల మిం(జా)మల నాలుగు కిందటి నెలలో కొన్నవే. అంటే వాటిలో రెండు అప్పుడే చినిగిపోయాయన్నమాట. అదికూడా చంకలో చినుగు ఒక చినుగు కాదనుకుంటే మటుకే. లేక పోతే మూడు చినిగా యన్నమాట. నెలకు మూడేసి చొక్కాల చొప్పున మనం కొన లేమని వేరే చెప్పాలా!"

చాకలి నాకేసి కోపంగా చూసి, "చొక్కాలు నేను చింపా నంటున్నారా?" అన్నాడు.

'ఛీ, ఛీ! ఎబ్బెబ్బె! ఎంతమాట! నేను ఎప్పటికీ అనను. ఈ బట్టల సమస్య నేను సంపూర్ణంగా నీ సహకారంతోనే సాల్వ్ చెయ్యదలిచానని నీవు నమ్మవచ్చు."

"అదికాదు లెండి, బాబూ, అమ్మగారన్నారు, నన్ను మానేసి ఇంట్లోనే చాకిరేవు పెడతా మని. అందు కడిగా!" అన్నాడు చాకలి.

"దాని మొహం! దానికేం తెలుసు? ఈ సోషలిష్టు కబుర్లు కేంలే?... మనం ఇండియా ప్రభుత్వంలాగే ఖర్చు తగ్గించాలి. లోటు లేని బడ్జెటు తయారుచేసుకోవాలంటే నెలకు మూడు-పోనీ, రెండు-చొక్కాలు కుట్టించుకునే మాట తలపెట్టరాదు. అందుకని ఏం చెయ్యాలి? ఆ విషయం నువ్వు ఏ సలహా చెబితే అది చెయ్యటానికి సర్వసంసిద్ధంగా ఉన్నాను. అంతేగాని చాకిరేవు జాతీయం చేసేదికల్ల. అనగా కల్లో వార్త."

"బాబూ, నా మాటిని ఇంట్లో చొక్కా వెయ్యటం మానెయ్యండి."

"భేష్ !"

"ఒక్కో చొక్కా సోదంగా వారం రోజులు వాడండి."

"మాకా వా !"

"మరోచ్చి, చినిగిన చొక్కాలన్నీ అమ్మగారి చేత కుట్టించండి."

"వింటున్నావురటే !"

"అంతేగాని నిక్షేపంలాటి ఇస్త్రీ బట్టలు మానుకుని చవుకు లేనోళ్ళలాగా ఉంటారా, బాబూ !"

"చాలా బాగా చెప్పావురా! నాకు నిజంగా అష్టమి నువ్వొక్కడివే కనిపిస్తున్నావు. మా ఆవిడే నాకు గర్భశత్రువై పోయి, చొక్కాలు ఇస్త్రీకి వెయ్యకుండా ఉంటే, విళ్ళకొద్దీ ఉంటాయనీ, నీకిచ్చే పని రూపాయలూ ప్రతి నెలా ఆదా అవుతాయనీ, బట్టల ఖర్చు నెలకి ఇరవై చొప్పున మిగులుతుందనీ పచ్చి సామ్యవాదం మాట్లాడుతున్నదంటే నమ్ము."

"నాకు పన్నెండు రూపాయలు చేయించండి, దొరా! ముడిసరుకు, అంటే చోమా సీల్డూ అవీ మహా గిరాకీగా ఉన్నాయి" అన్నాడు చాకలి.

"దానికేం భాగ్యం !; వచ్చే దీపావళికి నీకు ప్రత్యేక ఈనాం ఇస్తాను జ్ఞాపకం చెయ్యి" అన్నాను.

ఇంతలో అమ్మకక్కలాగా మా ఆవిడ వంటింట్లోనుంచి ఊడిపడి, "వాడితో చొక్కాల మీద లెక్చర్లు కొడుతున్నారేమిటి? బట్టలెందుకు చించుతున్నాడో అడగరేం? నా చీరెలు అన్నీ దాళ్ళవాళ్ళు చేశాడు. ఒక్క చీరె లేదు." అని ఆరంభించింది.

"నీ స్వార్థం మాస్తే నాకు ఒళ్ళు మండిపోతోంది. వాడూ మనిషేనా? వాడి కష్టసుఖాలు విచారించావా? నే నేదో చెప్పవలసినట్టు చెయ్యుతున్నాగా? మధ్య నువ్వు వేలుపెట్టటం దేనికి? నీకు తెలిసినపాటి నాకు తెలీదూ! చాల్లే ఊరుకో!" అని మా ఆవిణ్ణి గట్టిగా కోప్పడ్డాను.

"అన్నట్టు వాడు కిందటి ఉతుకులో మీ శాలువ ఒకటీ బనీనొకటీ తీసుకురాలేదు... అది తెచ్చావట్రా?"

"అప్పుడే తెస్తినిగా, అమ్మగారూ!"

"అబద్ధం! పచ్చి అబద్ధం!"

"వాడట్టా అబద్ధా లాడేవాడు కాదు."

"మీరు లెక్క తప్పుగా చూస్తుంటా రమ్మగారూ? నే నింటో ఎంత వెతికినా కనిపించందే ఉంటే ఏమవుతాయా?"

"లెక్క నీ ఎదట చూస్తిని కాదుట్రా?"

"అయితే తప్పుగా రాస్తుంటారు."

"మాచారా, వాడు ఎంతలో మాట మారుస్తాడు!"

'నువ్వూరుకోవే! పోయిన బట్టల విచారణ' సంఘం వేస్తాను. దానికి మన చాకలే అధ్యక్షుడుగా ఉంటాడు. నువ్వు వాడికి మాటికి మారు పాల్గొ సహకరించి పోయిన గుడ్డల ఆరా తీయి. న్యాయంగా విచారణ జరపటానికి నాకే అర్థం కరమూ లేదు."

"మీ మొహంమల్లే ఉంది విచారణ !"

"ఛప్ ! నోరు కట్టు! చాకలి అర్జినెప్పు పాస్ చేసేస్తున్నాను. నేను మళ్ళీ చెప్పేవరకూ నువ్వు చాకలాడిమీద చాడీలు చెప్పటానికి వీల్లేదు."

"అయితే వాడూ మీరూ ఎందుకోనన్నా దూకండి. నన్ను మాత్రం చినగని గుడ్డ లడక్కండి."

"అదేంమాట! బట్టలు ఉతకటం వాడిపంతూ, నా కవి ధారణయోగ్యమైన స్థితిలో అందించటం నీవంతూనూ! మన చాకలీ, నువ్వూ, నేనూ కలిసి నిర్మలహృదయంతో పరస్పరం సహకరించుకుంటేనేగాని ఈ సమస్య పరిష్కారం కాదు" అని చెప్పేశాను.

"రావు"